కుటుంబ గణన అస్తవ్యస్తం

- సందేహాల నడుమ ఇంటింటి వివరాల సేకరణ
- అధికారులొచ్చే తేదీపై ప్రజల్లో అస్పష్టత
- తొలిరోజు నామమాత్రంగానే సర్వే


వజ్జవారిగుంపులో వివరాలు నమోదు చేస్తున్న ఎన్యూమరేటర్

ఇల్లెందురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే శనివారం ప్రారంభమైంది. అంతకు ముందు మూడు రోజుల పాటు ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి కుటుంబాల గణన చేపట్టారు. ఈ సర్వేలో మున్సిపాలిటీ పరిధిలో 11,107 కుటుంబాలు, మండలంలో 18,667 కుటుంబాలు ఉన్నట్లు నమోదు చేసుకొని సర్వే సులభతరంగా ఉండేందుకు వారు నివసిస్తున్న ఇళ్లకు స్టిక్కర్లు అటించారు. ఈ ప్రక్రియలో ఎన్యూమరేటర్ల తొందరపాటు పనులు ప్రజలను కొంతమేర ఇబ్బందులకు గురిచేశాయి.

ఆలస్యం.. నామమాత్రం..

రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే శనివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఉన్నతాధికారులు ఇప్పటికే ప్రకటించారు. దీనికోసం సర్వే ఫారంలను ఒకరోజు ముందే ఎన్యూమరేటర్లకు అందించాల్సి ఉన్నప్పటికీ అవి శనివారం ఉదయమే మండల కేంద్రాలకు చేరాయి. దీంతో కొంత ఆలస్యంగా ఎన్యూమరేటర్లు వాటిని స్వీకరించారు. దీనికి తోడు రెండో శనివారం కావడంతో ఎన్యూమరేటర్లలో చాలామంది సర్వేకు దూరంగా ఉండిపోయారు. వీరిలో టీచర్లతోపాటు పంచాయతీ కార్యదర్శులు కూడా విధులకు గైర్హాజరవడం గమనార్హం. ఇంతే కాకుండా సర్వే ప్రారంభించాల్సిన తొలిరోజే అధికారులు ఎన్యూమరేటర్లతో సమావేశం నిర్వహించడం.. వంటి కారణాలతో తొలిరోజు సర్వే ఆలస్యంగా ప్రారంభమై నామమాత్రంగా సాగింది.

కుటుంబ నిర్ధారణలో గందరగోళం...

పల్లెల్లో ఒకటి కంటే ఎక్కువ కుటుంబాలు ఒకే ఇంట్లో నివాసం ఉండటం అందరికీ తెలిసిందే. దీనికి తోడు తాజాగా నిర్వహిస్తున్న సర్వే ఆధారంగా సంక్షేమ పథకాలు అమలవుతాయన్న ప్రచారం కూడా ఉండటంతో ప్రతీఒక్కరు కుటుంబ గణనపై జాగ్రత్తలు తీసుకున్నారు. కానీ పల్లెల్లో ఉన్న నిరక్షరాస్యులు సర్వేపై పెద్దగా అవగాహన లేక అధికారులు చెప్పిన వాటికి ఊ.. కొట్టారు. ఇదే వారికి భవిష్యత్‌లో ఇబ్బందులను తెచ్చిపెట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉదాహరణకు మండలంలోని సుదిమళ్ల గ్రామపంచాయతీ పరిధిలో కల్తి బుచ్చమ్మ అనే మహిళకు సొంతంగా రేషన్‌కార్డు ఉన్నప్పటికీ ఇంటి వద్దే ఉన్న కుమారుడితో కలిపి ఒకే కుటుంబంగా ఎన్యూమరేటర్లు నమోదు చేశారు. వివరాల సేకరణ కూడా పూర్తి చేశారు. తనకు వేరుగా రేషన్‌కార్డు ఉన్నందున వేరు కుటుంబంగా గుర్తించాలని కోరింది. ఇప్పుడే చేసేది ఏముండదని ఎన్యూమరేటర్ చెప్పడంతో ఏమి చేయాలో పాలుపోని స్థితిలో ఆమె ఉండిపోయింది. అయితే ప్రభుత్వం తాజా సర్వేను ప్రామాణికంగా తీసుకుంటే తనకు మంజూరైన రేషన్‌కార్డు రద్దై కుమారుడి రేషన్‌కార్డులో తన పేరును నమోదు చేస్తారేమోనన్న ఆమె సందేహం వ్యక్తం చేస్తోంది. ఇలాంటి సమస్యతో పలు కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయి.

అధికారులు వచ్చే తేదీపై అస్పష్టత...

కుటుంబాల గణన వేగవంతంగా పూర్తి చేసిన అధికారులు అంతే వేగంగా వివరాల సేకరణకు కూడా వస్తారన్న నమ్మకం ప్రజల్లో ఏర్పడింది. వివరాల సేకరణ కోసం అధికారులు ఇంటికి వచ్చే తేదీపై స్పష్టత కొరవడటంతో ప్రజల్లో అటువంటి అభిప్రాయం నెలకొంది. కానీ ప్రతీ ఎన్యూమరేటర్ రోజుకు పది కుటుంబాలకు తగ్గకుండా సర్వే చేయాలని ప్రభుత్వం సూచించింది. కానీ ఎన్యూమరేటర్లు ఎప్పుడు వచ్చేది ఎవరికీ తెలియక తొలిరోజైన శనివారం ఇళ్లకే పరిమితమై ఒక రోజు కూలీని కోల్పోయారు.

కోడ్‌లతో కొంత గందరగోళం...

సర్వే ఫారంలో ఉన్న ప్రశ్నలపై ప్రజల నుంచి వచ్చిన సమాధానాలను ఎన్యూమరేటర్లు నమోదు చేసుకుంటున్నారు. ఆయా వివరాలను అంకెల రూపంలో ఉన్న కోడ్‌లో అధికారులు నమోదు చేసుకోవడం ప్రజల్లో కొంత గందరగోళం కలిగిస్తోంది. సమాధానాలను అంకెల రూపంలో నమోదు చేయడంతో తాము చెప్పిన సమాధానాలను అధికారులు సక్రమంగా నమోదు చేస్తున్నారా లేదా అన్న అనుమానం ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

వేరుగా నమోదు చేయాలి...



నాకు ముగ్గురు కుమారులు. ఇద్దరు ఉద్యోగరీత్యా వేరే ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. ఇంటివద్ద ఉన్న కుమారుడికి, నాకు వేర్వేరుగా రేషన్‌కార్డులు ఉన్నాయి. అయినా ఇద్దరినీ ఒకే కుటుంబంగా నమోదు చేశారు. సర్వే కూడా అలాగే చేస్తున్నారు. ఇలాగైతే నా రేషన్‌కార్డు రద్దవుతుందేమోనని ఆందోళనగా ఉంది. – కల్తి బుచ్చమ్మ, సుదిమళ్ల

రోజంతా ఇంటివద్దే ఉన్నాం...



మాది నిరుపేద కుటుంబం. రోజు కూలీకి వెళ్తే తప్ప కుటుంబం గడవదు. కుటుంబ గణనకు వచ్చిన అధికారులు 9వ తేదీ నుంచి సర్వేకు వస్తామన్నారు. దీంతో శనివారం ఎటూపోకుండా ఇంటి వద్దే ఉన్నాం. అధికారులు రాలేదు. మేము కూలీకి వెళ్లకుండా చేశారు. రోజూ పనికి వెళ్తేనే పూట గడిచేది. – తాదూరి పద్మ, సబ్‌జైల్ బస్తీ, ఇల్లెందు

క్లుప్తంగా

డిప్యూటీ సీఎం భట్టికి వినతి


భట్టికి సమస్యలను విన్నవిస్తున్న నాయకులు

కొత్తగూడెంరూరల్: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి జిల్లాలోని పలు సమస్యలపై పోట్ల నాగేశ్వరరావు, జేబీ శౌరి వినతిపత్రాన్ని అందజేశారు. ఖమ్మం పర్యటనకు వచ్చిన భట్టిని శుక్రవారం రాత్రి కలుసుకుని ప్రభుత్వపరంగా జరుగుతున్న అభివృద్ధి పనులు, సింగరేణిలో అభివృద్ధి పరంగా జరుగుతున్న మార్పుకు కొంతమంది అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొన్ని పార్టీలు పాత్తులపేరుతో చేస్తున్న తప్పుడు పద్ధతుల వలన కాంగ్రెస్ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతం తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

సిస్టర్ అనూషకు సన్మానం


ఫాదర్లు, కుటుంబ సభ్యులతో అనూష

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులోని ఆర్‌సీఎం చర్చిలో శనివారం జరిగిన కార్యక్రమంలో సిస్టర్ అనూషను ఘనంగా సన్మానించారు. వెంగన్నపాలెం గ్రామానికి చెందిన దేవరకొండ నిర్మల, బాబూరావు దంపతుల కుమార్తె అనూష సిస్టర్ అయిన తరువాత తొలిసారి స్వగ్రామానికి రావడంతో ఫాదర్లు, క్రైస్తవులు, కుటుంబ సభ్యులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. స్థానిక ఆర్‌సీఎం చర్చిలో జరిగిన కార్యక్రమంలో సిస్టర్ అనూషను ఫాదర్లు, రాజకీయ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫాదర్లు బంధనాథం శౌరి, జోహన్స్, ఫ్రాన్సిస్, జయరాజ్, జోజప్పా, రాజకీయ నాయకులు మందా బాబు, నర్వనేని పుల్లారావు, వేల్పుల నరసింహారావు, మోదుగు సుగుణరావు, పోతురాజు నాగరాజు, మోదుగు రామకృష్ణ, కొలిపాక సురేష్, మందా దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అయ్యప్ప మాలధారులు


ఆలయంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

టేకులపల్లి: మండలంలో అయ్యప్ప మాలధారుల పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలోని శ్రీకోదండరామాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన పీఠం మాలధారులు భక్తితో పాటు పర్యావరణ హితమైన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా కార్తీమ మాసం తొలి శనివారం సందర్భంగా రామాలయంలో బత్తాయి, నిమ్మ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి బోడ మంగీలాల్ నాయక్, బానోతు సర్దార్ నాయక్, జాటోత్ రమేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సేవాభావం చాటుతున్న విద్యుత్ ఏఈ


ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న కన్నయ్య

టేకులపల్లి/కొత్తగూడెంరూరల్: టేకులపల్లి మండలం బొమ్మనపల్లి సబ్ స్టేషన్ ఏఈ పిండిపోలు బుజ్జి కన్నయ్య తన విధులను అంకిత భావంతో నిర్వహిస్తూనే సేవాభావాన్ని చాటుకుంటున్నారు. తన తండ్రి స్వాతంత్ర్య సమర యోధుడు, హిందీ టీచర్, మాజీ సీఎం జలగం వెంగళరావుకి ఆత్మీయ మిత్రుడు పిండిపోడు రామయ్య 90వ జయంతి సందర్భంగా పిండిపోలు రామయ్య సేవా సంస్థ ఆధ్వర్యంలో కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రి, మాతాశిశు కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అదే విధంగా అటవీ ప్రాంతంలో కోతులకు పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, ఆకలితో ఉన్న వారి ఆకలి తీర్చడం సేవా సంస్థ ముఖ్య ఉద్దేశ్యమని ప్రతీ సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాసుల వెంకట్, ఎంఏ.రజాక్, ఎం.శ్రీరాములు, పోతు పురుషోత్తం, పోతు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచకుంటే పోరాటం ఉధృతం


ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు డిసెంబర్ 9లోపు పెంచకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, ఐక్య పోరాటాలకు సిద్ధమవుతామని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.మధు హెచ్చరించారు. సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కావొస్తున్నా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. సింగరేణి యాజమాన్యం కూడా కార్మికుల శ్రమను గుర్తించకుండా వేతనాలు పెంచకుండా ఈఎస్‌ఐ అమలు చేయకుండా 7వ తేదీ లోగా వేతనాలు ఇవ్వకుండా కార్మికుల కడుపు కొడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ నైపుణ్యంతో పనిచేస్తున్న కార్మికులకు హైస్కిల్డ్ వేతనాలు చెల్లించకుండా స్కిల్డ్ వేతనాలతో సరిపెడుతున్నారని దుయ్యబట్టారు. కాంట్రాక్ట్ కార్మికుల పట్ల సింగరేణి యాజమాన్యం స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

తాగునీరు అందించడంలో విఫలం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపల్ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడంలో స్థానిక ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ విమర్శించారు. శనివారం పట్టణంలోని గుడివాడ రామ్ లక్ష్మణుల బస్తీ 29వ వార్డులో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ తిరిగి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కొత్తగూడెం మున్సిపల్ పరిధిలో కొన్ని నెలలుగా కిన్నెరసాని తాగునీరు బురదమయంగా వస్తున్నా పాలకులకు పట్టింపు లేదని, అధికారులు సమస్య పరిష్కరించాలనే ఆలోచన చేయకపోవడం విచారకరం అన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని, సమస్యలు పరిష్కరిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు కానీ, ప్రజలు తాగటానికి వీలులేని విధంగా నెలల తరబడి బురద నీరు సరఫరా అవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో గంధం మల్లికార్జున్‌రావు, మాలోత్ వీరునాయక్, తాటి పాముల హరికృష్ణ, నౌతాన్, తేజ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధిపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న అంజయ్య నాయక్

పాల్వంచ: ఆదివాసీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ అన్నారు. గిరిజన సమాఖ్య జిల్లా 3వ మహాసభను శనివారం స్థానిక చంద్ర రాజేశ్వర రావు భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య నాయక్ మాట్లాడుతూ.. అడవులను నమ్ముకుని జీవిస్తున్న గిరిజనులను ఆ అడవి నుంచి దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయన్నారు. హరితహారం పేరుతో దాడులు, నిర్బంధాలకు పాల్పడుతూ గిరిజనుల అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లిస్తుండటంతో గిరిజన గ్రామాలు కనీస మౌలిక వసతులకు నోచుకోవడం లేదన్నారు. పెట్టుబడి దారుల ఆధిపత్యం నుంచి బైటపడేందుకు ఆదివాసీ గిరిజనులు సంఘటితమై ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు రామ్మూర్తి నాయక్, కల్లూరి వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీనివాస్, సోంది కుటుంబరావు, బానోత్ వెంకట్, గుగులోతు రామచంద్ర నాయక్, వెంకట నర్సమ్మ, దసురు, కృష్ణ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై పట్టింపేది..?

- వీధుల్లో పారుతున్న మురుగు
- అవస్థలు పడుతున్న పట్టణ ప్రజలు
- పట్టించుకోని అధికారులు


పోస్టాఫీసు సెంటర్‌లో అధ్వానంగా పారిశుద్ధ్యం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం జిల్లా కేంద్రంలో రోజురోజుకు పారిశుద్ధ్య సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. డ్రెయినేజీలు సరిగా లేకపోవడం వలన మురుగు వీధుల్లో పారుతోంది. దీంతో పాటుగా చెత్తచెదారంతో అంతర్గత రోడ్లు చిన్నపాటి డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు సమస్యలపై చర్యలు తీసుకోకపోవడం వలన పట్టణ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ పరిధిలోని జిల్లా ఆస్పత్రికి వెళ్లె వీధుల్లో చెత్తచెదారం నిండిపోయి ఉన్నాయి. డస్ట్ బిన్లు లేకపోవడం వలన స్థానికులు, చెత్తను వీధుల్లోనే వేయడం, మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది ఆ చెత్తను డంపింగ్ యార్డుకు తరలించకపోవడం వలన చిన్నపాటి డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. దీని వలన దోమలు విజృంభణతో అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులు రెగ్యులర్, కాంట్రాక్ట్ వారు కలిసి 216 మంది వరకు ఉన్నప్పటికీ చెత్తను డంపింగ్ యార్డులకు తరలించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. పట్టణంలోని సెవెన్‌హిల్స్ ఏరియా నుంచి సింగరేణి ఆస్పత్రి వరకు ఉన్న ప్రధాన రోడ్డులో చిరువ్యాపారులు, ఇళ్లల్లోని వారు చెత్తకుప్పలు ఏర్పాటు చేస్తున్నా వాటిని తొలగించడంలో కార్మికులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ప్రధాన రోడ్డులో కూడా చెత్తచెదారం కనిపిస్తోంది.

ఇదిలా ఉంటే పోస్టాఫీసు సెంటర్‌లో ఐఎన్‌టీయూసీ బిల్డింగ్‌కు సంబంధించిన మురుగు పక్కనే ఉన్న వీధిలో వెళ్తుండడం వలన ఆ వీధి అంతా దుర్వాసన వెదజల్లుతోంది. ఈగలు, దోమలు రావడంతో స్థానికంగా వ్యాపారం చేసేవారు, ఇళ్లలోని ప్రజలు అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టి పేరుకపోతున్న చెత్తను తొలగించి, డ్రెయినేజీలను శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇది త్యాగధనుల బొగ్గుట్ట..


మాట్లాడుతున్న సోమయ్య

ఇల్లెందు: ఎందరో త్యాగధనులను అందించిన బొగ్గుట్టలో తొలిసారి సీపీఎం జిల్లా మహాసభలు జరుగబోతున్నాయని, ఇక్కడి ప్రజలు కమ్యూనిస్టులను ఆనాటి నుంచి నేటి వరకు ఆదరిస్తున్నారని అదే ఒరవడిలో మహాసభలు ఇల్లెందులో నిర్వహించాలని సీపీఎం నిర్ణయించదని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సోమయ్య అన్నారు. శనివారం ఇల్లెందులోని ఐతా ఫంక్షన్ హాల్‌లో సీపీఎం జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన సోమయ్య మాట్లాడుతూ.. ఇల్లెందు తొలి ఎమ్మెల్యే కేఎల్ నర్సింహారావు, తొలి మున్సిపల్ చైర్మన్ వినయ్‌కుమార్‌లు మచ్చలేని పాలన అందించారని కొనియాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ... కూడు, గూడు, నీడ లేని పేదలకు అండగా నిలిచింది కమ్యూనిస్టులేనన్నారు. సీటు, ఓట్లు కాకుండా ప్రజల కష్టాలు, నష్టాలు వాటికి పరిష్కారం లక్ష్యంగా ముందుకు సాగటమే కమ్యూనిస్టులకు తెలుసన్నారు. ఇల్లెందులో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేసే వారికోసం అనేక పోరాటాలు చేసిన సీపీఎం ఈ గడ్డ మీద మహాసభలు నిర్వహించబోతోందన్నారు. ఈ సభల విజయవంతానికి ప్రజలు, మేధావులు, వ్యాపార వాణిజ్య సంస్థలు, న్యాయవాదులు, డాక్టర్లు విద్యా సంస్థలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఎస్‌ఏ నబీ, మచ్చా వెంకటేశ్వర్లు, మందలపు జ్యోతి, పిట్టల రవి, మెరుగు సత్యనారాయణ, దుగ్గి కృష్ణ, మండా రాజన్న, డాక్టర్ శ్రీధర్‌లోథ్, పగడాల నాగేశ్వర రావు, ఏజే రమేష్, పుల్లయ్య, కారం పుల్లయ్య, బ్రహ్మచారి, లిక్కి బాలరాజు, శ్రీధర్, రేపాకుల శ్రీనివాస్, కాళంగి హరికృష్ణ, ఆలేటి కిరణ్‌కుమార్, బయ్యా అభిమన్యు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు కల్పించాలి


కుమురంభీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆదివాసీ ఉపాధ్యాయులు

పాల్వంచరూరల్: ఆదివాసీలకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నానమాద్రి సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని కుమురంభీం భవనంలో శనివారం ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ 13వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భీం విగ్రహానికి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించి, ఏటీఏ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్‌ను 2012 నవంబర్ 9న స్థాపించినప్పటి నుంచి ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ ఉపాధ్యాయుల సమస్యల సాధనకు పోరాటం చేస్తున్నట్లు వివరించారు. గిరిజన సంక్షేమ శాఖలో పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి ఆశ్రమ పాఠశాలలో పదోన్నతి కల్పించాలని, ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 40 సంవత్సరాలుగా డైలీ వర్కర్లుగా పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులర్ చేయాలన్నారు. భద్రాచలంలోని బీఈడీ కళాశాలలో ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బంది పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ముడిగ సమ్మయ్య, కల్లూరి బొర్రయ్య, తోలెం వెంకటేశ్వర్లు, కలం సత్యం, సిద్ధబోయిన వెంకటేశ్వర్లు, మురళి, రఘు, కోటేశ్వరరావు, గాంధీ, రాంప్రసాద్, రామకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

వాగు దాటితేనే సాగు..

- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు
- వాగుపై వంతెన నిర్మించాలని రైతుల వేడుకోలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


వంతెన నిర్మించాల్సిన ఎదుళ్లవాగు ప్రాంతం

సుజాతనగర్: సుజాతనగర్ వాసులకు ప్రతీ ఏటా వాగు కష్టాలు తప్పడం లేదు. సుజాతనగర్, గొల్లగూడెం తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 50 మంది రైతులకు చెందిన వ్యవసాయ భూములు ఎదుళ్లవాగుకు అవతల ఉండటంతో వర్షాకాలంలో వాగు దాటేందుకు అవస్థలు పడుతున్నారు. వరద ప్రవాహం చూస్తే బెంబేలెత్తక తప్పదు. వాగు అవతల ఉన్న పొలాలకు రైతులు వెళ్లాలంటే ప్రాణాలకు తెగించి దాటాల్సిందే. వాగు అవతల సుమారు 100 ఎకరాల ఆయకట్టు ఉంది. మరో మార్గంలో వెళ్లాలంటే చుట్టూ తిరిగి 10 కిలోమీటర్ల దూరం ప్రయాణించలేక 500 మీటర్ల వాగును అతికష్టంతో దాటుతున్నారు. ముఖ్యంగా మహిళలు వాగు దాటాలంటే అష్టకష్టాలు పడుతున్నారు. ప్రమాదమని తెలిసినా పొలాలకు వెళ్లాల్సి రావడంతో సాహసం చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు..

తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు...

వ్యవసాయ సీజన్‌లో రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతం. పంటలకు వేయాల్సిన మందుకట్టలు, ఇతరత్రా వాటిని తీసుకెళ్లేందుకు వాగు దాటలేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. లక్ష్మీదేవిపల్లి మీదుగా లేదంటే కోమటపల్లి మీదుగా చుట్టూ తిరిగి రావాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. పొలాల దగ్గరకు వెళ్లి మందులు చల్లడం, పశువులకు మేత తీసుకరావడానికి నానా కష్టాలు పడుతున్నారు. వాగుపై వంతెన ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులకు గతంలో వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. వంతెన నిర్మించాల్సిన ప్రదేశం శివాలయానికి దగ్గరగా ఉంది. వంతెన నిర్మిస్తే రామవరం, రుద్రంపూర్ తదితర ప్రాంత ప్రజల రాకపోకల మూలంగా శివాలయం సైతం అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఈ దిశగా పాలకులు, అధికారులు ఆలోచించాలని రైతులు కోరుతున్నారు.

ఇంటింటి సమగ్ర సర్వే ప్రారంభం


జూలూరుపాడు: నల్లబండబోడులో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న డీపీఓ చంద్రమౌళి, డీఎల్పీఓ రమణ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీలోని వార్డుల్లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే శనివారం కొనసాగింది. ఇందులో భాగంగా సర్వేకు కేటాయించిన వారు ఇంటింటికి తిరుగుతూ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలను అడిగి నమోదు చేసుకుంటున్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ దామోదర్ ఇంట్లో జరిగిన సర్వేలో కమిషనర్ శేషాంజన్‌స్వామి పాల్గొని సర్వే తీరును పరిశీలించారు. దీంతో పాటుగా 35వ వార్డులో జరిగిన సర్వేలో స్థానిక కౌన్సిలర్ రుక్మాంగదర్ బండారి పాల్గొని సర్వే తీరు పరిశీలించారు. సర్వేలో సూచించిన ప్రశ్నలు అడిగి నమోదు చేయించుకోవాలని, ప్రజలు సర్వేపై ఎటువంటి అపోహలు లేకుండా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో 35వ వార్డు సూపర్‌వైజర్ హరికృష్ణ, ఎన్యూమరేటర్లు వర్ల రాజ్యలక్ష్మి, భాగ్య పాల్గొన్నారు.

జూలూరుపాడు: రెండో దశ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే శనివారం ప్రారంభమైంది. మొదటి దశ సర్వేలో భాగంగా తొలి మూడు రోజులపాటు ఎన్యూమరేటర్లు గృహాలను సందర్శించి స్టిక్కరింగ్ పూర్తి చేశారు. రెండో దశ సర్వేలో ఎన్యూమరేటర్లు ప్రతీ ఇంటికి వెళ్లి వ్యక్తిగత, కుటుంబ వివరాలను సేకరించి నమోదు చేస్తున్నారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులం, కేటగిరి వివరాలను నమోదు చేస్తున్నారు. జూలూరుపాడు మండల వ్యాప్తంగా 73 మంది ఎన్యూమరేటర్లు సర్వేలో పాల్గొంటున్నారు. ఈ సర్వే ఈనెల 30 వరకు కొనసాగనుంది. మండలంలోని నల్లబండబోడు గ్రామంలో కొనసాగుతున్న ఇంటింటి సర్వేను డీపీఓ చంద్రమౌళి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కులగణన సర్వే వివరాలను ఎన్యూమరేటర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజలంతా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కొత్తగూడెం డీఎల్పీఓ రమణ, ఎంపీఓ తులసీరామ్, తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: సామాజిక ఆర్థిక సమగ్ర కుటుంబ సర్వే మొదలైంది. ఈనెల 6 నుంచి 8 వరకు గ్రామాల్లో నివాసాలను గుర్తించి ఇంటి గోడలపై స్టిక్కర్లు అతికించారు. శనివారం నుంచి సమగ్ర కుటుంబ వివరాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. టేకులపల్లి మండలంలో మొత్తం 36 గ్రామ పంచాయతీలలో 16,356 నివాసాలు ఉన్నాయి. 109 మంది ఎన్యూమరేటర్లు, 11 మంది సూపర్‌వైజర్లు సర్వేలో నిమగ్నమయ్యారు. ఒక్కో ఎన్యూమరేటర్ 150–200 కుటుంబాలను సర్వే చేయాల్సి ఉంటుంది. ప్రతీ 10 మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్ సర్వే తీరుని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఎన్యూమరేటర్లకు సలహాలు, సూచనలు ఇస్తూ ప్రజల అనుమానాలను నివృత్తి చేస్తున్నారు.


టేకులపల్లి: బోడు గ్రామంలో...


కొత్తగూడెంఅర్బన్: సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్


జూలూరుపాడు: వెంగన్నపాలెంలో